# నేడు సిద్దిపేటకు సీఎం కేసీఆర్

- ప్రజా ప్రగతి ఆశీర్వాద సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న బీఆర్‌ఎస్ అధినేత
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి హరీశ్‌రావు


సిద్దిపేటలో సిద్ధమైన సీఎం కేసీఆర్ సభా వేదిక

సిద్దిపేట, అక్టోబర్ 16: సిద్దిపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ప్రగతి ఆశీర్వాద సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సభ ఏర్పాట్లను ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి, సిద్దిపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి తన్నీరు హరీశ్ రావు పరిశీలించారు. సిద్దిపేట శివారులోని నాగదేవత గుడి బైపాస్‌లో సిరిసిల్లకు వెళ్లే రోడ్డులో సభ ఏర్పాటు చేస్తున్నారు. లక్ష మందితో నిర్వహించనున్న సభకు అందుకు అనుగుణంగా సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. బారీకేడ్లు, లైట్లు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల సభ ముగియగానే సీఎం కేసీఆర్ సిద్దిపేటకు రానుండడంతో సభాస్థలి పక్కన హెలి ప్యాడ్‌ను, సభా వేదికను సిద్ధం చేశారు. సభకు వచ్చే ప్రజలందరికీ కేసీఆర్ సందేశం స్పష్టంగా వినబడేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. మహిళలు, యువకులు భారీగా తరలిరానున్నారు. సుమారు 20వేల మంది విద్యార్థులు, యువకులు, రైతులు అభిమానులతో బైక్ ర్యాలీ సభా ప్రాంగణానికి చేరుకోనుంది. సీఎం కేసీఆర్ సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు సభకు చేరుకోనుండగా సాయంత్రం 5.30 గంటలకు సభ ప్రారంభం అవుతుంది.

**పార్కింగ్ ఏర్పాటు**

ఆయా మండలాల నుంచి సభాకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట రూరల్, అర్బన్ మండలాలు బ్లాక్ ఆఫీస్ చౌరస్తా నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా నుంచి నాగదేవత గుడి చౌరస్తా నుంచి సభా ప్రాంగణానికి చేరుకోవాలి. చిన్నకోడూరు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నారాయణరావుపేట మండలంలోని వేములవాడ రూట్‌లోని గ్రామాల ప్రజలు సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి సభా ప్రాంగణానికి చేరుకోవాలి. సిద్దిపేట పట్టణం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ర్యాలీలుగా బతుకమ్మ, బోనాలతో సభకు హాజరు కానున్నారు. అందరూ కూర్చునేలా కుర్చీలను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణమంతా లైటింగ్ ఏర్పాటు చేశారు. సభ ప్రాంగణం చుట్టూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కటౌట్లు పెట్టారు. మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. కళాకారుల కోసం వేదిక ఏర్పాటు చేశారు.

**గులాబీమయమైన సిద్దిపేట**

సీఎం కేసీఆర్ పురిటిగడ్డ సిద్దిపేట సీఎం కేసీఆర్ రాక కోసం సిద్ధమైంది. సీఎం సభను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణమంతా గులాబీమయమైంది. సీఎం కేసీఆర్ కటౌట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని అన్ని కూడళ్లలో కటౌట్లు, గులాబీ జెండాలతో అలంకరించారు. సభకు వెళ్లే అన్ని దారులు గులాబీమయమయ్యాయి. గులాబీ తోరణాలు, జెండాలతో అలకరించారు. భారీ ఎత్తున సభకు జనం రానుండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.


సభా ప్రాగంణం వద్ద కటౌట్ కడుతున్న సిబ్బంది

## ఊరుఊరంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు


తీర్మానప్రతిని అందజేస్తున్న శంకరాయకుంట గ్రామస్తులు

చిన్నకోడూరు, అక్టోబర్ 16: తమ ఊరును గ్రామ పంచాయతీగా మార్చి గ్రామాభివృద్ధిని కాంక్షించిన మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ వెంటే ఉంటామని చిన్నకోడూరు మండలం శంకరాయకుంట గ్రామ ప్రజలు కృతజ్ఞతగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ ప్రతిని చిన్నకోడూరు ఎంపీపీ కూర మాణిక్యరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంప గుత్తగా తమ ఓట్లను బీఆర్‌ఎస్‌కు, మంత్రి హరీశ్ రావుకే వేస్తామంటూ ముక్తకంఠంతో నినదించారు. గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సంఘం ఏకగ్రీవ తీర్మానాన్ని పార్టీ మండల నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో మాస్టర్ల ప్రతిభ

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 16: హైదరాబాద్‌లో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం జాతీయ స్థాయి కరాటే రెఫ్రి జడ్జ్ పోటీలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది బ్లాక్ బెల్ట్ మాస్టర్లు, సీనియర్, జూనియర్లు ఆయా కేటగిరీల్లో పోటీపడ్డారు. ఇందులో జపాన్ కరాటే ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ సిద్దిపేటకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్లు, జూనియర్లు 10 మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. కరాటే అసోసియేషన్ ఇండియా జనరల్ సెక్రటరీ హన్సీ రాజనీష్ చౌదరి చేతుల మీదుగా సీనియర్ విభాగంలో ఎంఎస్ పాషా, ఎల్లాగౌడ్, ప్రభాకర్, మల్లేశం, ఎల్లాదాస్ జూనియర్ విభాగంలో రేవంత్‌సాయి, ఆస్మాతరనమ్, హరబా హుసైన్ ప్రశంసాపత్రాలు, బ్యాడ్జీలు అందుకున్నారు.

## బీఆర్‌ఎస్ సిద్దిపేట రూరల్ మండల అధికార ప్రతినిధిగా గోపీనాథ్‌రెడ్డి



సిద్దిపేటరూరల్, అక్టోబర్ 16: బీఆర్‌ఎస్ సిద్దిపేట రూరల్ మండల అధికార ప్రతినిధిగా గోపీనాథ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రకటించారు. నియామకపత్రాన్ని గోపినాథ్‌రెడ్డికి అందించి శుభాకాంక్షలు తెలిపారు. తోర్నాల గ్రామానికి చెందిన గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై అపారమైన నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను శక్తివంచనలేకుండా నిర్వర్తిస్తానని తెలిపారు. హరీశ్‌రావుకు మెజార్టీ వచ్చేలా పని చేస్తానని తెలిపారు.

## రాజకీయ పార్టీలతో సమావేశం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం కోసం చేసే ఖర్చులను ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి నోటిఫికేషన్ విడుదల చేసే వరకు పార్టీలపై, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ వేసే నాటి నుంచి అభ్యర్థుల ఖర్చులను లెక్కిస్తామన్నారు. ఎన్నికల్లో ఉపయోగించే వాహనాలు, వస్తువులు, ఆహార పదార్థాలకు, ఇతర ఖర్చులను లెక్కిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం సూచించిన ధరలను పరిశీలించి స్థానిక డిమాండ్‌ను బట్టి ఆయా వస్తువులకు ఉండాల్సిన ధరల విషయంలో సూచనలు, సలహాలు అందించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రతినిధి జె.మోహన్‌లాల్, బీజేపీ ప్రతినిధి బోగి శ్రీనివాస్, ఎంఐఎం ప్రతినిధి ఎండీ మునీర్, వైఎస్ఆర్సీపీ ప్రతినిధి టి.జగదీశ్వర్ గుప్తా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి జి.మధు, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అమృతసేనా రెడ్డి, ఆర్టీవో జనార్ధన్ రెడ్డి, డీఎస్‌వో తనూజ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## బీఆర్‌ఎస్‌లో చేరికల జోష్


మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కోనాయపల్లి, పోసాన్‌పల్లి గ్రామాలకు చెందిన యువకులు

రాయపోల్, అక్టోబర్ 16: దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 మంది యువకులు, కోనాయపల్లి గ్రామానికి చెందిన 50మంది యువకులు సోమవారం దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కాండువాలు కప్పి ఆహ్వానించారు. రెండు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చి బీఆర్‌ఎస్‌లో చేరడంతో దౌల్తాబాద్ మండల కేంద్రం గులాబీమయంగా మారింది. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు వెంకటనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రహిమొద్దీన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బండారు దేవేందర్ ఉన్నారు.

**రాయపోల్ మండలం నుంచి..**

రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలతోపాటు యువకులు పెద్దసంఖ్యలో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కాండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పడకంటి శ్రీనివాస్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు ఇప్ప దయాకర్, రాజిరెడ్డి ఉన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వడ్డేపల్లి నాయకులు

# లక్ష మందితో ఆశీర్వాద సభ

- సిద్దిపేట మట్టి బిడ్డకు ఘనస్వాగతం పలకాలి
- 20 వేల మందితో బైక్ ర్యాలీ
- బతుకమ్మలు, బోనాలతో మహిళలు తరలిరావాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16: బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతి ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమావారం సిద్దిపేటలో ఆశీర్వాద సభ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. లక్ష్య సాధన కోసం లక్ష మందితో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గ ప్రజలతోనే సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటనను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ప్రకటన, బీఫాంలు అందజేయడం, ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ ముందున్నది. రేపు సీట్లు సాధించడంలోనూ బీఆర్‌ఎస్ ముందుంటుందన్నారు. సీఎం కేసీఆర్ తాను పుట్టిన గడ్డకు రాబోతున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి సిద్దిపేట ప్రతిష్టను ప్రపంచ పటంలో సీఎం కేసీఆర్ నిలబెట్టారన్నారు. సీఎం కేసీఆర్ మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు హెలీకాప్టర్‌లో సిరిసిల్ల నుంచి సిద్దిపేటకు చేరుకుంటారని తెలిపారు. 5 గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి సుమారు లక్ష మంది తరలివస్తున్నట్లు చెప్పారు. బైక్ ర్యాలీగా 20 వేల మంది యువకులు, విద్యార్థులు, రైతులు వస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ కుల వృత్తుల వారు వారి వేషధారణలతో, మహిళలు బతుకమ్మలు, బోనాలతో తరలివస్తారన్నారు. ప్రజలను తరలిరావడానికి అవసరమైన వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణం నుంచి సభ వరకు మహిళలు కాలి నడకన వస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**ఆచితూచి బీఆర్‌ఎస్ మేనిఫెస్టో**

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో సీఎం కేసీఆర్ ఆచితూచి.. ఒక కన్నతండ్రిలాగా, ఒక కుటుంబ సభ్యుడిలా ఆలోచించి తయారు చేశారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కాంగ్రెస్ నుంచి కాపీ కొట్టారని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతున్నారని.. ఎవరి ఫథకాలు ఎవరు కాపీ కొట్టారో చెప్పాలన్నారు. నమ్మకానికి మారు పేరు కేసీఆర్ అని.. నయవంచనకు మారు పేరు కాంగ్రెస్ పార్టీ అన్నారు. రైతుబీమా తరహాలో 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా'ను మేనిఫెస్టోలో పెట్టారన్నారు. రాష్ట్రంలో లక్షా 11 వేల మంది రైతుబీమా లబ్ధి పొందారన్నారు. కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ వంటి పథకాలు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. నేడు 'సౌభాగ్యలక్ష్మి'ని మహిళల కోసం తెస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందని, రాష్ట్రంలో పేదవారికి రూ.400కే సిలిండర్ అందించేలా మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి చెరువుకట్టపై రామక్క పాట మారుమోగుతున్నదని, ప్రతి మహిళ కారు గుర్తుకు ఓటేసేందుకు నడుం కడుతున్నదని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా హ్యాట్రిక్ మాత్రం కేసీఆర్‌దే అన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.